క్లుప్తంగా

విద్యుత్ స్తంభాలు స్వాధీనం

తోట్లవల్లూరు: విద్యుత్ స్తంభాలతో పశువుల షెడ్డు నిర్మాణంపై ట్రాన్స్‌కో అధికారులు గురువారం విచారణ జరిపారు. మండలంలోని దేవరపల్లిలో విద్యుత్ స్తంభాలతో పశువుల షెడ్డు నిర్మాణంపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై ట్రాన్స్‌కో ఏఈఈ దేవదాస్ రెడ్డిబత్తుల శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన షెడ్డును పరిశీలించారు. 2018లో హెచ్‌వీడీఎస్ స్కీమ్ వర్క్ పనులు జరిగాయి. అప్పుడు విరిగిపోయిన స్తంభాలను అక్కడే వదిలిపెట్టి వెళ్లడం జరిగింది. విరిగిపోయిన రెండు స్తంభాలను శ్రీనివాసరెడ్డి తన షెడ్డు నిర్మాణానికి వినియోగించాడని, దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు వాటిని తొలగించడం జరిగిందని దేవదాస్ తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించిన ప్రాపర్టీని ఎవరు దుర్వినియోగం చేసిన శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



కైకలూరు: గ్రామీణ స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సూచించారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో శీతనపల్లి గ్రామ కమిటీని గురువారం ఆయన నియమించారు. ఎరిచర్ల రాజశేఖర్(సింగ్)ను గ్రామాధ్యక్షుడిగా ఎంపిక చేసి నియామక పత్రాలను అందించారు. డీఎన్నార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలపై కార్యకర్తలు, నాయకులు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, గ్రామ నాయకులు పులిచర్ల వెంకట సత్యనారాయణ, ఉచ్చుల విజయ్‌కుమార్, నారగాని హరిబాబు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజా వేదిక

కైకలూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) పనులపై శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వైపీఎస్ఆర్ఎస్ ప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కైకలూరు మండలంలోని 26 గ్రామాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు జరిగిన పనులపై జూన్ 1 నుంచి 19 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ పనులపై ప్రజా వేదిక నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధి కూలీలు, శ్రమమిత్రాలు, శ్రమ సమైఖ్య సంఘాలు హాజరు కావాలని ఆయన కోరారు.

అన్నసమారాధన

మండవల్లి: మండవల్లి పీహెచ్‌సీ వద్ద కొలువైన శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుతగా బాబావారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



పమిడిముక్కల: గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని గన్నవరం ఏడీఏ సునీల్ వీఏఏలకు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం శాఖాపరమైన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలు ఆన్‌లైన్ చేయడం, ఏపీ సీడ్స్‌కు నగదు చెల్లింపులపై సమీక్షించారు. వ్యవసాయశాఖ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏఓ గణేష్‌రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక అదృశ్యమవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక రామాంజనేయ కాలనీకి చెందిన ఒడుగు సాయిపూజిత స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈనెల 18వ తేదీ సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాలిక తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శేషారావుకు నివాళి

కైకలూరు: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన చటాకాయి సర్పంచ్ ఘంటసాల శేషారావు సంతాప సభ గురువారం గ్రామంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఈర్గనైజింగ్ సెక్రటరీ జయమంగళ కాసులు, వడ్డే కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బలే ఏసురాజు, నాయకులు జయమంగళ సుబ్బరాజు పాల్గొని శేషారావు చిత్రపటానికి నివాళులర్పించారు.

శిథిలావస్థలో చౌటపల్లి గ్రంథాలయం



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



సమస్యలతో ఉన్న చౌటపల్లి గ్రంథాలయం

- పెచ్చులూడుతున్న భవనం
- భయాందోళనలో పాఠకులు, సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

గుడివాడరూరల్: పాఠకులు, విద్యావంతులు, నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందిస్తున్న మండలంలోని చౌటపల్లి గ్రామంలోని గ్రంథాలయం నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రంథాలయంలో ఎటు చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. దీంతో పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు, పాలకులు గ్రంథాలయ అభివృద్ధిని విస్మరిస్తున్నారని పాఠకులు ఆందోళన చెందుతున్నారు. భవనం పైకప్పు పెచ్చులూడి పడి పాఠకులను భయాందోళనలకు గురిచేస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాఠకులు, చిన్నారులు భయం భయంగా గడుపుతున్నారు.

కనీస వసతులు కరువు

ప్రస్తుతం గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరి కూనరిల్లుతోంది. ప్రధాన భవనం పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. భవనం పైన పిచ్చి మొక్కలు మొలచి రూపురేఖలు లేకుండా పోయాయి. భవనం శిథిలమై పెచ్చులూడి పడటంతో పాఠకులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తుతున్నారు. కనీస మౌలిక వసతులు కల్పించాలని వేడుకుంటున్నా కూడా అధికారులు సమస్యలపై దృష్టిసారించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు గ్రంథాలయంలో ఉన్న సమస్యలపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని పాఠకులు, విద్యావంతులు, గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రంథాలయంలో పెచ్చులూడిన పైకప్పు

సమస్యలు వినేవారే లేరు



ప్రతిరోజు గ్రంథాలయానికి నిరుద్యోగులు, చిన్నారులు, పెద్ద వారు వస్తుంటారు. గ్రంథాలయం లోపల, బయట పైకప్పు పెచ్చులూడి ప్రమాదభరితంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఏ పెచ్చు ఎప్పుడు ఊడి మీద పడుతుందోనని భయం భయంగా చదవాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యలు చెప్పినా వినేవారు లేరు. గ్రంథాలయానికి వెళ్లాలంటేనే భయమేస్తుంది.

– బాలు, పాఠకుడు

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



రైతులకు యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కాజ(మొవ్వ): వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే విత్తన శుద్ధి కచ్చితంగా చేసుకోవాలని, విత్తన శుద్ధితో తెగుళ్లకు ఉధృతికి చెక్ పెట్టవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్త డాక్టర్ డీ సుధారాణి సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తల బృందం మొవ్వ మండలంలోని కాజ గ్రామంలో వరి పంటలో అధిక దిగుబడులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పొడి విత్తన శుద్ధి మూడు గ్రాముల కార్బెండజిం ఒక కిలో విత్తనానికి, తడి విత్తన శుద్ధి ఒక గ్రాము కార్బెండజిం ఒక కిలో విత్తనానికి ఒక లీటర్ నీటిలో 24 గంటలు నానబెట్టి నారుమడుల్లో చల్లుకోవాలని సూచించారు. డాక్టర్ ఎం. వెంకటలక్ష్మి మాట్లాడుతూ సార్వ పంటకు అనువైన వరి రకాలు, ఆరోగ్యవంతమైన నారు పెంచడానికి తగు సూచనలు, ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కే రేవతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా యోగాంధ్ర



గుడివాడ టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 400 మంది విద్యార్థులతో యోగా నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణాజిల్లా కో–ఆర్డినేటర్ కావూరి శ్రీధర్, ఎన్టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ సీవీకే ప్రసాద్ పర్యవేక్షణలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు – లక్ష్మి దంపతులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీ పద్మావతి, దండమూడి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ముదినేపల్లి రూరల్: యోగ సాధనతో ఏకాగ్రత, మానసిక ప్రశాంతతను పొందవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోచ్ కే రఘురామ్ గురూజీ పేర్కొన్నారు. స్థానిక ఫార్మసీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ యోగా సాధన చేయడం ద్వారా దీర్ఘకాలిక రోగాలను నియంత్రించొచ్చన్నారు. అదేవిధంగా శరీరంపై అదుపు, ఆజ్ఞలను పొందొచ్చని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు పలు రకాల ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా దేవదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో యోగా జ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, యువకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి కైలే పరామర్శ



రాజేశ్వరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: మండలంలోని గరికపర్రులో ఇటీవల మృతిచెందిన పాలకేంద్రం మాజీ అధ్యక్షురాలు ముసిబోయిన వెంకట రాజేశ్వరి కుటుంబసభ్యులను గురువారం పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. వెంకట రాజేశ్వరి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, సర్పంచ్‌లు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్, నాయకులు నడకుదురు రాజేంద్ర, చింతలపూడి సుబ్బారావు, చింతలపూడి గవాస్కర్ రాజు, వేమూరి కృష్ణబాబు, మైనేని తారాచంద్, బోలెం చంటి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: విధి నిర్వాహణలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ నెల 21న జరిగే యోగాంధ్ర సన్నాహక కార్యక్రమంపై కైకలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కామినేని మాట్లాడుతూ శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, కూటమి నేతలు, ముదినేపల్లి తహసీల్దారు లతీఫ్‌పాషా, ఎంపీడీవోలు రామకృష్ణ, రామలింగేశ్వరరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



దూళపూడిపాలెం కొత్త వంతెన వద్ద దుస్థితి



వీరంకి మలుపులో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



అప్రోచ్ రోడ్డు లేని వీరంకి వంతెన



ప్రమాదకరంగా ఉన్న ధూళిపూడిపాలెం వంతెన



ముత్రాసిపాలెం వద్ద కోతకు గురైన రోడ్డు

ఆదమరిస్తే అంతే..

పమిడిముక్కల: మండలంలోని పలు రోడ్ల మార్జిన్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. వీరంకి మలుపు వద్ద, ముత్రాసిపాలెం వద్ద రోడ్డు మార్జిన్లు కోతకు గురయ్యాయి. అదేవిధంగా ధూళిపూడిపాలెం పాత వంతెన వద్ద రెయిలింగ్స్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ధూళిపూడిపాలెం, వీరంకి వంతెన వద్ద అప్రోచ్‌లు లేకపోవడంతో ఈ ప్రాంతాల్లో వాహనదారులు ఆదమరిస్తే పక్కనే ఉన్న కాల్వల్లో పడే ప్రమాదం ఉంది. రోడ్డు మార్జిన్లు పటిష్టపరచాలని, ధూళిపూడిపాలెం వంతెన వద్ద ఇరువైపులా రెయిలింగ్స్ ఏర్పాటు చేయాలని, వంతెనల వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక



పామర్రు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కైలే అనిల్‌కుమార్ పామర్రు నియోజకవర్గంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై వైఎస్ జగన్‌తో చర్చించారు.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



వల్లూరుపాలెం క్వారీలోకి లారీలు వెళ్లకుండా అడ్డుకట్ట వేసిన దృశ్యం

తోట్లవల్లూరు: వల్లూరుపాలెం రేవు నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ డీకే బాలాజీకి ఫిర్యాదు చేసినట్లు జనసేన మండల ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి సత్యన్నారాయణ తెలిపారు. బుధవారం రాత్రి లారీలను నిలువరించే ప్రయత్నం చేస్తే పలువురు టీడీపీ నాయకులు తనను పక్కకు లాగేసి లారీలు బయటకు పంపించారని తెలిపారు. వల్లూరుపాలెం క్వారీ నుంచి జేసీబీల ద్వారా లారీల్లోకి ఇసుకను లోడింగ్ చేసి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ డీకే బాలాజీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశానని సత్యన్నారాయణ పేర్కొన్నారు. తహసీల్దార్ కుసుమకుమారి గురువారం ఉదయం లారీలు క్వారీలోకి వెళ్లకుండా బాటను తవ్వించి అడ్డుకట్ట వేయించారని చెప్పారు. క్వారీలో తనపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం



తోట్లవల్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న, ఆరోగ్య సిబ్బంది

తోట్లవల్లూరు: సికిల్ సెల్ ఎనీమియా పట్ల జాగ్రత్తగా ఉండాలని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన తోట్లవల్లూరులో గురువారం ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో సికిల్ సెల్ ఎనీమియా రావడానికి గల కారణాలను వివరించారు. గిరిజన వర్గాలకు సికిల్ సెల్ ఎనీమియా రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. రక్తపరీక్షలు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సికిల్ సెల్ నివారణకు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సీహెచ్ఓ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ దివ్యలత, ఏఎన్ఎంలు నిర్మలమేరీ, కిరణ్‌కుమార్, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో...

పెదపారుపూడి: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉంటే మంచి జరుగుతుందని ఎంపీడీవో విమాదేవి అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ వ్యాధి గిరిజన ప్రాంతాల్లో జెనటిక్‌గా వస్తుందని చెప్పారు. వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఈపీఆర్డీ వంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు



పంటపొలాల్లో జేసీబీతో తవ్వకాలు

నందివాడ: జనార్ధనపురంలో రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పంట పొలాల్లో హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు గురువారం అధికారులు జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలిసి అడ్డుకునేందుకు వెళ్లిన రైతులను పోలీసులు, అధికారులు పొలంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు తమ పొలంలో టవర్లు ఏర్పాటు చేయడానికి అనుమతి పత్రాలను చూపాలని రైతులు కోరారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా హై టెన్షన్ టవర్ల ఏర్పాటుకు తవ్వకాలు మొదలుపెట్టడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు పొలాల్లో ఏర్పాటు చేస్తే తమ భూమిని వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోయారు. సంబంధిత అధికారులు చొరవ చూపి ఈ సమస్యకు తగిన పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

వరదలపై అవగాహన

పెదపారుపూడి: వరదలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీను నాయక్ పేర్కొన్నారు. మండలంలోని మోపర్రు, వింజరంపాడు, నాగాపురం గ్రామాల్లో గురువారం ఆయన వరదలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బుడమేరు వల్ల వరదల సమయంలో మోపర్రు, వింజరంపాడు గ్రామాల పూర్తిగా దెబ్బతినడం జరుగుతోందని తెలిపారు. వరదలు సంభవించే సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు.

మహిళపై అత్యాచార యత్నం, దాడి

గుడివాడ టౌన్: మహిళపై అత్యాచార యత్నం విఫలమవడంతో ఆమెపై టీడీపీ నాయకుడు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం రాత్రి పెదపారుపూడి మండలం ఈదురు మద్దాలి గ్రామానికి చెందిన మహిళ రాత్రి 8.30 గంటల తర్వాత తన షాపు మూసి ఇంటికి వస్తున్న నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరరావు ఆమెను వెంబడించి ఇంటి వద్ద దింపుతానని మోటార్ సైకిల్ ఎక్కించుకున్నాడు. ఇంటికి వెళ్లే దారి కాకుండా వేరే దారి మళ్లించడంతో ఆమె అరుస్తూ కేకలు వేసింది. అయినప్పటికీ కోటేశ్వరరావు మోటార్ సైకిల్ ఆపకుండా వేగంగా చీకటి మార్గంలోకి తీసుకువెళుతుండగా ఆమె భయంతో బైక్ నుంచి దూకేసింది. దీంతో ఆమె గాయాలపాలైంది. బైక్‌పై నుంచి దూకిన ఆమెపై అతడు దాడి చేసి ఈ విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించాడు. నేను టీడీపీ కార్యాలయంలో పనిచేస్తున్నాను.. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు, మర్యాదగా ఈ విషయాన్ని మర్చిపో లేకుంటే నీ కుటుంబ సభ్యులపై దాడి చేస్తానని హెచ్చరించారు. ఈ ఘటనపై పెదపారుపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వైద్యపరీక్షల నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందిగా ఆమెకు సూచించారు. ఆసుపత్రి వైద్యులు గాయాలున్నట్లు నిర్ధారించినా కోటేశ్వరరావు టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేయలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి కేసు నమోదు చేయాలని ఆమె కోరారు.





'జల జీవన్' పైప్ లైన్ల పరిశీలన

మండవల్లి: జలజీవన్ మిషన్ పథకం ద్వారా పేద ప్రజలకు అందజేయనున్న పైపులైన్లు వారికి ఎంతో ఊరట కలిగిస్తాయని సర్పంచ్ మెండా ఝాన్సీ పేర్కొన్నారు. స్థానిక జలజీవన్ మిషన్ పైపులైన్ పనులను సర్పంచ్ ఝాన్సీ, సురేష్‌బాబు గురువారం పరిశీలించారు. పేద ప్రజలకు ఈ పథకం ద్వారా పైపులైన్లు ఉచితంగా అందజేయనున్న తెలిపారు.